క్లుప్తంగా

ఎస్సెస్సీ విద్యార్థులకు అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): పదో తరగతి తరువాత విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను అందించే కొత్త కోర్సులను ఎంచుకొని పరిజ్ఞానం సంపాదించాలని రామవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. శనివారం రామవరంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు కెరీర్ గైడ్‌లైన్స్, కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు.

'అనుబోస్'లో ఉద్యోగ నియామకాలు

పాల్వంచ: పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం ఉద్యోగ నియామకాలను నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓరియంట్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ విద్యార్థులకు మేనేజర్ ఎం.రవీందర్ ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు హాజరు కాగా 70 మందిని ఎంపిక చేశారు. అర్హత సాధించిన వారికి సంవత్సర ఆదాయం రూ.2.50లక్షలు ఉంటుందని తెలిపారు.

9నుంచి శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు

పాల్వంచరూరల్: జగన్నాథపురం - కేశవాపురం గ్రామాల మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు కలశ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సుదర్శన్ శనివారం తెలిపారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు రుద్రహోమం..

పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే రుద్రహోమంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'టిఫిన్ బైఠక్'



టిఫిన్ తింటున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీలో 197వ బూత్ బీజేపీ అధ్యక్షుడు విజయకుమార్ గృహంలో శనివారం టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు పార్టీ ఆవిర్భావం, ఆనాటి జాతీయ నాయకులు చేసిన సేవలు, వాళ్ల ప్రాణ త్యాగాలు, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ త్యాగం వంటి అంశాలపై వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, ఆకుల నరేష్, దొడ్డ అన్వేష్, విజయ్, కిరణ్ కుమార్, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు.

చెక్ డ్యాం పనుల అడ్డగింత

జూలూరుపాడు: భేతాళపాడు పంచాయతీ చీపురుగూడెం సమీపంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులను శనివారం రైతులు అడ్డుకున్నారు. చెక్ డ్యాం నిర్మాణంతో పంట పొలాలు కోల్పోతున్నామని, పరిసర రైతుల అంగీకారం లేకుండా అడ్డగోలుగా ఇరిగేషన్ అధికారులు చెక్ డ్యాం నిర్మిస్తున్నారని, పనులు నిలిపి వేయాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. చెక్ డ్యాం వల్ల వరద ఉధృతికి పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. దీంతో అధికారులు తాత్కాలికంగా పనులు నిలిపి వేస్తున్నట్లు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

పిల్లలకు మానవతా విలువలు నేర్పాలి

కొత్తగూడెంఅర్బన్: సాటివారి పట్ల ప్రేమానురాగాలు, ఆప్యాయత, మానవతావాదులుగా జీవించేలా పిల్లలకు శిక్షణ ఇవ్వడం ఎంతో అవసరం అని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఫాతిమా అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని మజీద్ ఎ ఖూబా లైబ్రెరీలో చిన్న పిల్లల ఇఫ్తార్ విందులో ఆమె మాట్లాడారు. రంజాన్ ఉపవాసాల ద్వారా ఆకలి అంటే ఏమిటో స్వయంగా అనుభవించి సమాజంలోని ఆకలితో బాధ పడేవారికి సహాయం చేసే గుణం అలవడుతుందన్నారు.




లాంగ్ జంప్, పరుగుపందెం పోటీల్లో సునంద (ఫైల్)




లెవల్ -2 ధ్రువపత్రం అందుకుంటూ.., తల్లిదండ్రులకు స్వీట్లు తినిపిస్తున్న సునంద

విజయానందం..!

- జాతీయ స్థాయిలో ఇల్లెందు క్రీడాకారిణి సునంద ప్రతిభ
- వరల్డ్ అథ్లెటిక్ కోచ్ కోర్స్ లెవల్ -3కి ఎంపిక
- ఇల్లంతా ఆటగాళ్లే



సునందను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య (ఫైల్)

సండే స్పెషల్

ఇల్లెందు: బొగ్గు బావులకు పుట్టినిల్లైన బొగ్గుట్టలో ఓ జాతీయ స్థాయి క్రీడాకారిణి అసాధారణ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి వరల్డ్ అథ్లెటిక్ కోచ్ కోర్సు లెవల్ -3 కి ఎంపికైంది. ఆమె ఇల్లెందు పట్టణంలోని 14 నెంబర్ బస్తీ 15వ వార్డుకి చెందిన మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరీ- సోనీబాయిల కుమార్తె సునంద. ఇంట్లో అంతా క్రీడాకారులే... తల్లిదండ్రులతో పాటు పిల్లలు ఆయా క్రీడారంగాల్లో ప్రతిభను చాటుకోవడం విశేషం. గత జనవరిలో పంజాబ్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ కోచ్ కోర్స్ త్వరలో ఇండోనేషియాలో ప్రారంభం కానుంది. ఈ పోటీలకు జరిగిన ఎంపికలో సునంద లెవల్ -3 గ్రేడ్‌కు ఎంపికైంది. 2021లో కోచ్ లెవల్ -1 కేరళ త్రివేండ్రంలో పూర్తి చేసింది. 2024 కోచ్ లెవల్ -2 పంజాబ్ పాటియాలలో పూర్తి చేసి లెవల్ -3 ఇండోనేషియాకు ఎంపికైంది. దేశ స్థాయిలో జరిగే ఈ ఎంపికలో తెలుగు రాష్ట్రాల నుంచి తెలంగాణలోని ఇల్లెందుకు చెందిన సునంద అరుదైన అవకాశం దక్కించుకుంది.

సునంద ఇంట పతకాల పంట...

సునంద ఇల్లెందు పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. చిన్నతనం నుంచి అథ్లెటిక్స్‌లో ప్రావీణ్యం సంపాదించింది. ఉపాధ్యాయులు, పీఈటీల ప్రోత్సాహంతో రన్నింగ్, లాంగ్ జంప్‌లో అత్యుత్తమ క్రీడాకారిణిగా ఎదిగింది. ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసి 2014 నుంచి 17 వరకు కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఎన్ఐఎస్ కోర్సు, బీపీడీ కోర్సు పూర్తి చేసింది. అటు చదువును కొనసాగిస్తూనే ఇటు ఆటల్లో పథకాల పంట పండించింది. ఇప్పటి వరకు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు 52 పతకాలు కైవసం చేసుకోగా 21 బంగారు, 17 రజతం, 14 కాంస్య పతకాలు లభించాయి.

సునంద ముంగిటకు...

వరల్డ్ అథ్లెటిక్ కోచ్ కోర్స్ లెవల్ -3 ఎంపికైన సునందకు ఎన్నో అవకాశాలు ఆమె ముంగిటకు వచ్చి చేరుతున్నాయి. పలు క్రీడా సంస్థలు తమ సంస్థలో పని చేయమని ఆఫర్లు అందిస్తున్నాయి. చెన్నై ఇస్మా అకాడమీ, పీటీ ఉషా అథ్లెటిక్స్ అకాడమీ, ఒడిశా కిట్ అకాడమీలు ఆహ్వానించాయి.

తెలంగాణ నుంచి ఏకైక కోచ్...

ఇల్లెందు పట్టణంలోని 15వ వార్డులో మాజీ కౌన్సిలర్ కుమార్తె సునంద వరల్డ్ అథ్లెటిక్ కోచ్ కోర్సు లెవల్ -3 ఎంపిక త్వరలో ఇండోనేషియాలో ప్రారంభం కానున్న కోర్సులో పాల్గొనబోతున్న ఏకైక కోచ్‌గా నిలవనుంది. కోచ్‌గా ఎంపిక కావాలంటే తన పర్యవేక్షణలో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభను చాటుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి. అలాంటి వారికే కోచ్ కోర్సులో చేరే అవకాశంతోపాటు అందులోనూ లెవల్-1, లెవల్-2, లెవల్ -3 ఇలా ఉన్న కోర్సులకు ఎంపికయ్యే చాన్స్ ఉంటుంది. 2019 నుంచి 2024 వరకు ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల కాచనపల్లి స్పోర్ట్స్ స్కూల్‌లో పీఈటీగా కాంట్రాక్ట్ పీఈటీగా సునంద పని చేసింది. ఈ సమయంలో అక్కడి విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. ఆమె పర్యవేక్షణలో అక్కడి విద్యార్థులు 137 పతకాలు సాధించారు.

ఇంట్లో అందరూ క్రీడాకారులే..

సుదర్శన్ కోరీ- సోనీబాయిలకు నలుగురు సంతానం. వీరంతా క్రీడాకారులే. సుదర్శన్ కోరీ చిన్నతనం నుంచి ఫుట్‌బాల్, లాంగ్ జంప్‌తో పాటు కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఆయన భార్య సోనీబాయి కూడా ఖోఖో, రన్నింగ్, లాంగ్ జంప్‌లోనూ పతకాలు సాధించింది. కుమారుడు సుమిత్ ఫుట్‌బాల్, లాంగ్ జంప్‌లో పలు పతకాలు సాధించాడు. మరో కుమారుడు సుజిత్ బాస్కెట్ బాల్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక బహుమతులు అందుకున్నాడు. స్పోర్ట్స్ కోటాలో ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఆనందంగా ఉంది..



బొగ్గు బావులకు పుట్టినిల్లైన బొగ్గుట్ట నుంచి వరల్డ్ అథ్లెటిక్ కోచ్ కోర్సు లెవల్ -3 ఎంపిక కావడం గర్వంగా ఉంది. ఎవరైనా తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించాలంటే ప్రోత్సాహంతోపాటు సరైన శిక్షణ అవసరం. తనకు మెంటార్స్ ఎండీ గౌస్, కె.మహీదార్‌ల ప్రోత్సాహం వల్ల ఈ స్థాయికి చేరుకున్నాను.
– సునంద

గర్వంగా ఉంది..



మాతో పాటు మా పిల్లలు క్రీడా రంగంలో ఉన్నందుకు గర్వంగా ఉంది. వారు ప్రతిభతో ఒక్కో మెట్టు ఎక్కుతుంటే ఎంతో ఆనందంగా ఉంది. మా పిల్లలకు చిన్ననాటి నుంచి నేటి వరకు నిరంతరం మా నుంచి ప్రోత్సాహం అందించాము. వారు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించడం చెప్పలేని ఆనందంగా ఉంది.
– సుదర్శన్‌కోరీ

ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న సెర్ప్, ఐసీడీఎస్ ఉద్యోగులు

ఇల్లెందు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకునేందుకు అవగాహన అవసరం అని సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం ఇల్లెందు వెంగళరావునగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగోలీ నిర్వహించి ముగ్గులు ద్వారా ఏఏ యంత్రం ఎలా పని చేస్తుందో వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ శారద, ఆయా రజిత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సెర్ప్ కార్యాలయంలో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనతరం ర్యాలీ నిర్వహించారు. సెర్ప్ ఏపీఎం దుర్గారావు, ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీఒక్కరూ ఓటరుగా నమోదవ్వాలని, పోలింగ్ రోజున విధిగా ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సూచించారు.

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాల్లో మహిళా సమాఖ్య సభ్యులు, అంగన్‌బాడీ టీచర్ల సమన్వయంతో శనివారం అధికారులు ముగ్గులు పోటీలు నిర్వహించారు.

కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ జి.రవీందర్రావు, ఏపీఎం రవికుమార్, మండల పంచాయతీ అధికారి గాంధీ, సెర్ప్ సిబ్బంది, ఐసీడీఎస్ సీడీపీఓ తార, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

కొత్తగూడెంఅర్బన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించిన సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణంలో మొత్తం 12 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు.

జూలూరుపాడు: మండల కేంద్రం పాపకొల్లు క్రాస్ రోడ్ వద్ద జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపీఓ తోట తులసీరామ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు, వెంగన్నపాలెం జీపీ సెక్రటరీ లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుల్ సురేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చెమన్ పరిశీలన



చెమన్‌ను పరిశీలిస్తున్న ఏజీఎం రామకృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రామవరంలోని అంబేద్కర్ చెమన్‌ను శనివారం ఏరియా సివిల్ ఏజీఎం రామకృష్ణ పర్యవేక్షించారు. ఇటీవల రామవరంలోని సీనియర్ సిటిజన్ పార్క్‌లో ఉన్న సమస్యలను ఏరియా ఏజీఎం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఆయన పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయగిరి శ్రీనివాస్, డీవైజీఎం రాజారాం, ఏరియా వాసులు తొగరు రాజశేఖర్, పద్మారావు, మున్నా బేగం, సందీప్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఈద్గా ఖబరస్తాన్ అండ్ అడ్‌హక్ కమిటీని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డును చేసిందని రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో నమాజ్ నిర్వహించుకునేందుకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు శనివారం కొత్తగూడెం ఈద్గా కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా మహ్మద్‌గౌస్ మొయిద్దీన్, 27 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఏ రజాక్, అన్వర్ పాషా, ఖమర్, యాకూబ్‌ఖాద్రీ, మహ్మద్ హుస్సేన్ ఖాన్, మహ్మద్ అక్తర్‌పాషా, అమీర్‌ఖాద్రీ, బషీర్‌హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి..



ఇల్లెందు: నిరసన దీక్షలో బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు: ఎన్నికల ముందు అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజలకు ఇబ్బడిముబ్బడిగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ అంగోతు బిందు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు జగదాంబా సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రైతుల సమస్యల పరిష్కారం కోసం ఒక్క రోజు దీక్ష చేపట్టారు. మాట్లాడుతూ.. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో అధోగతి పాలైందన్నారు. ఎండలు మండిపోతుండగా, చెరువులు ఎండి పంటలు భూములు బీళ్లుగా మారిపోతున్నాయన్నారు. దేవీలాల్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, బొమ్మెర వరప్రసాద్, తాత గణేష్, గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధాకృష్ణ, మూడు కృష్ణప్రసాద్, కౌన్సిలర్లు, కిష్టయ్య, కృష్ణారావు, రాజశేఖర్, డేరంగుల పోషం, గంగుల సత్యనారాయణ, కిషన్ నాయక్, సత్యనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆదేశానుసారం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం ఎదుట శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్, మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ మాట్లాడుతూ... 420 అబద్దాల పునాదుల మీద ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం తన నాలుగు నెలల పాలనలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఎన్నికల హామీ రూ.2లక్షల పంట రుణమాఫీని మరిచారన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాదావత్ శాంతి, భూక్యా సోన, అన్వర్‌పాషా, తొగరు రాజశేఖర్, అంబుల వేణుగోపాల్, బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్, దుర్గ, పిల్లి కుమార్, ఎల్.పూర్ణ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి సహకరించండి

ఇల్లెందు: ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి సహకరించాలని సంఘం పట్టణ, మండల నూతన అధ్యక్షులు అర్వపల్లి, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు కోరారు. శనివారం ఇల్లెందులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో ఆదివారం జరగనున్న పదవీ ప్రమాణ స్వీకారానికి ఆర్యవైశ్య సోదరులు తరలి రావాల్సిందిగా కోరారు. ఆర్య వైశ్యుల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పిన్సిపాల్ పద్మ

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, భాగ్య హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని మన పెద్దలు చెప్పిన సూచనను ప్రతీఒక్కరు ఆచరణలో పెట్టి ఆరోగ్య అలవాట్లను మెరుగుపర్చుకోవాలన్నారు. శ్రమలేని జీవితం వల్ల అనేక వ్యాధులు వస్తాయని, దీనిని అధిగమించేందుకు ప్రతీరోజు వాకింగ్‌ను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అధ్యాపకులు రాజు, చెంచు రత్నయ్య, కిరణ్‌కుమార్, ఇంద్రాణి, సరిత, రమేష్, సురేందర్ పాల్గొన్నారు.

ఏకపక్షంగా కూలి రేట్ల పెంపు

ఇల్లెందురూరల్: హమాలీ కూలి రేట్లను ఏకపక్షంగా పెంచడం అభ్యంతరమని కొమరారం ప్రాంత అఖిలపక్ష నాయకులు అన్నారు. కొమరారంలో శనివారం సమావేశమైన నాయకులు పలు అంశాలపై చర్చించారు. హమాలీ కూలి ధర పెంపు తమకు అంగీకారంగా లేదని స్పష్టం చేశారు. కొమరారం ఏరియాలో ప్రతీఏటా పంట చేతికొచ్చిన సమయంలో హమాలీ కూలి రేట్లపై వ్యాపారులు, రైతులు, హమాలీ యూనియన్ నాయకులు సంయుక్తంగా సమావేశం నిర్వహించి కూలి ధరలపై నిర్ణయం తీసుకునేవారని గుర్తుచేశారు. కానీ కొంత మంది వ్యాపారులు, హమాలీలు మాత్రమే సమావేశమై ధరలు నిర్ణయించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో క్వింటాకు రూ.8.25గా ఉన్న హమాలీ రేటును ఏకంగా రూ.10కి పెంచారని వాపోయారు. ఈ నిర్ణయంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా హమాలీ రేట్లపై తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు రైతులు సిద్ధంగా లేరని, గతం మాదిరిగా క్వింటాకు రూ.8.25 మాత్రమే చెల్లిస్తారని, పెంచిన రేటును వ్యాపారులే చెల్లించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు మూడు మాలు, వాంకుడోత్ శ్రీను, కుంజ నర్సయ్య, తరాచంద్, కాంపాటి ధర్మయ్య, పోలేపల్లి నాగేశ్వరరావు, మంచె రమేష్, కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గొల్లపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రవీందర్‌రావు

ఇల్లెందు(టేకులపల్లి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఎంపీడీఓ జి.రవీందర్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం వేసవికాలంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గొల్లపల్లి, సంపత్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐకేపీ మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఈఓ సర్టిఫికేషన్ చేసిన తర్వాత టోకెన్ తీసుకొని కొనుగోలు కేంద్రం వారిని సంప్రదించాలని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గాంధీ, మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఈఓ రెహానా బేగం, ఏపీఎం రవికుమార్, సీసీ నరేష్ సావిత్రి, వీఓఏలు రోజా, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

పాల్వంచరూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన చిరుతానిపాడు, కొయ్యగట్టు, పెద్దకల, రాళ్లచెలుక గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'ఏజెన్సీలో తాగునీటి ఇక్కట్లు' అనే శీర్షికతో శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఏఈ నీలావతి ఆయా గిరిజన గ్రామాలను శనివారం సందర్శించారు. నీటిఎద్దడి తీరు, గిరిజనులు నీళ్లు ఎక్కడ నుంచి తెచ్చుకుంటున్నారు, సమస్యకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాగునీటి ఎద్దడితో ఇక్కట్లు పడుతున్న గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జన జాతర సభకు తరలిన నేతలు



పాల్వంచ: సభకు బయలుదేరిన నాయకులు

పాల్వంచ: హైదరాబాద్ తుక్కుగూడలో జరిగిన జన జాతర సభకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పాల్వంచ నుంచి నాయకులు శనివారం భారీగా తరలి వెళ్లారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్లు, బస్సుల్లో నేతలు, కార్యకర్తలు వెళ్లారు. వెళ్లిన వారిలో యర్రంశెట్టి ముత్తయ్య, అయితా గంగాధర్, బద్ది కిశోర్, బాలినేని నాగేశ్వరరావు, భూక్యా గిరి ప్రసాద్, పైడిపల్లి మహేశ్, వజ్జల రాము, ఎలిక నాగేశ్వరరావు ఉన్నారు.

జూలూరుపాడు: తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జన జాతర బహిరంగసభకు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపు మేరకు.. మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో వేల్పుల నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, పోతురాజు నాగరాజు, పణితి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ కిషన్ నాయక్, ఆనగంటి లక్ష్మి, జ్యోతి, వెంకటేష్, వీరభద్రం, వెంకట్రామ్ తదితరులు ప్రత్యేక వాహనాల్లో సభకు వెళ్లారు.

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో తుక్కుగూడ జన జాతర మహాసభకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్లు, బస్సులలో వెళ్లారు. వెళ్లిన వారిలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్వాల శ్రీనివాస్‌రావు, ఆళ్ల మురళీ, తూము చౌదరి, రజాక్, చీకటి కార్తీక్, భాగం మోహన్‌రావు, పూజెం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నంగయ్య జాతర



పూజలు చేస్తున్న చీమల వంశీయులు

ఇల్లెందురూరల్: మండలంలోని దండగుండాల అటవీ ప్రాంతంలో బంగారి కోల నంగయ్య జాతరను చీమల వంశస్తులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న జాతరను ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో శనివారం ప్రత్యేక పూజలతో ముగించారు. మూడు రోజుల క్రితం సమీపంలోని గుట్టల నుంచి బంగారు కోల నంగయ్య నిశానీలను తీసుకొచ్చిన వడ్డెలు మూడు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వేళలో ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో ఆరాధ్య దైవాన్ని కొలిచారు. ముగింపు వేడుకలకు పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన చీమల వంశీయులు ప్రత్యేక పూజలు చేసి తమను చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో వడ్డెలు, చీమల వంశంలోని పలువురు పెద్దలు చీమల స్వామి, చీమల వెంకటేశ్వర్లు, నాగరాజు, కృష్ణమూర్తి, రామస్వామి, శంకర్, శివ, వీరభద్రం, రామయ్య, సమ్మయ్య, నంగయ్య తదితరులు పాల్గొన్నారు.